ఎన్జీవోస్ కాలనీ ప్రధాన రహదారి పక్కన ఒకే ప్రాంగణంలో నిర్మించిన మూడు అక్రమ షెడ్లు

టీచర్స్ కాలనీ ప్రధాన రహదారి పక్కన అక్రమంగా నిర్మిస్తున్న రెండు భారీ వాణిజ్య షెడ్లు

ఆక్రమణల జోరు..!

అడ్డగోలుగా వెలుస్తున్న వాణిజ్య షెడ్లు

- అడ్డూ అదుపు లేని అక్రమ నిర్మాణాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- నోటీసులిచ్చి సరిపెడుతున్న వైనం

వనస్థలిపురం, అక్టోబర్ 8: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో అక్రమ నిర్మాణాల తీరు జోరుగా సాగుతోంది. అరకొర అనుమతులు తీసుకుని అడ్డగోలుగా నిర్మాణాలు చేస్తున్నవి కొన్ని ఉండగా. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణమవుతున్న వాణిజ్య షెడ్లు మరికొన్ని ఉన్నాయి. ఇవన్నింటిని చూస్తున్న టౌన్ ప్లానింగ్ శాఖ కనీసం పట్టించుకోవడం లేదన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.

అక్రమాలను ఆపేదెవరు...

ప్రధాన రహదారుల వెంట వాణిజ్య షెడ్ల నిర్మాణం జోరుగా సాగుతుంది. జీహెచ్ఎంసీ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా వీటిని చేపడుతున్నారు. దీంతో స్థానికులు పలుమార్లు టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కొంత మంది సిబ్బంది నిర్మాణదారుల నుంచి అందినకాడికి దండుకుని తమకేమీ తెలియనట్లు ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. టీచర్స్ కాలనీ ప్రధాన రహదారిపై రెండు భారీ షెడ్లు నిర్మాణంలో ఉన్నాయి. వీటిపై పలు ఫిర్యాదులు కూడా వెళ్లాయి. నామ మాత్రపు నోటీసులు ఇచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారులు చేతులు దులుపుకొన్నారు. నిర్మాణాలు మాత్రం యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎన్జీవోస్ కాలనీ రోడ్ ఏరియా దవాఖాన చౌరస్తాలో గత రెండు నెలలుగా ఒకేచోట మూడు షెడ్లు నిర్మాస్తున్నారు. వీటిపై కూడా ఫిర్యాదులు వెళ్లువెత్తాయి. కానీ టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎవరైనా అడిగితే నోటీసులిచ్చాం అని సమాధానం చెబుతున్నారు. అడ్డుకోవాల్సిన వారు నోటీసులిచ్చి సరిపెడితే అక్రమాలను ఆపేదెవరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న మూసీ ప్రాంతంలోని నిర్వాసితులు

మూసీ ప్రాంత ప్రజలకు నష్టం కలుగకుండా చూస్తాం..

బాధితులను సీఎం, డిప్యూటీ సీఎం దగ్గరికి తీసుకెళ్తా: మధుయాష్కీ గౌడ్

ఎల్బీనగర్, అక్టోబర్ 8: మూసీ ప్రాంతం ప్రజలకు నష్టం కలుగకుండా చూస్తామని, బాధితులను సీఎం, డిప్యూటీ సీఎంల వద్దకు తీసుకెళ్లి న్యాయం చేస్తామని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ బరోసా ఇచ్చారు. మూసీ నది పరీవాహకంలోని చైతన్యపురి, ఫణిగిరి కాలనీల నిర్వాసితుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ.. మూసీ ప్రాంతంలోని ప్రజలు భయపడవద్దని, నిశ్చింతగా ఉండాలని అన్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌లో నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం తప్పక ఆలోచిస్తుందని అన్నారు. నగరంలో ఉన్న మూసీ వేరు, శివారులోని చైతన్యపురి, కొత్తపేట, నాగోలు ప్రాంతాల్లో ఉన్న మూసీ వేరని అన్నారు. మూసీ ప్రాంతంలో నిర్వాసితులు నివాసాలు కోల్పోకుండా నివాసాలు లేని ప్రాంతం వైపు ఎక్కువగా భూసేకరణ చేసే విధంగా ప్రభుత్వంలో మాట్లాడుతానని మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాశ్‌గౌడ్‌తో పాటు నిర్వాసితులు, వివిధ కాలనీల వాసులు పాల్గొన్నారు.

మలక్‌పేటలోని ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఉద్యోగులకు రోడ్డు ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ద్వారా వివరిస్తున్న బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు

అతి వేగం ప్రమాదకరం: ఏసీపీ జి.శంకర్‌రాజు

మలక్‌పేట, అక్టోబర్ 8: అతి వేగం ప్రమాదకరమని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు తెలిపారు. నగర సీపీ సీవీ.ఆనంద్, ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు మంగళవారం మలక్‌పేటలోని ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఉద్యోగులకు రోడ్డు ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణకు పాటించాల్సిన నియమాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 50 మంది ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ బ్రాంచ్ మేనేజర్ నవీన్ సింగ్, అడ్మిన్ శ్రీవాత్సవ్, ఉద్యోగులు, హీరో మోటోకార్ప్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ సాదిక్ సాగర్, టీటీఐ బేగంపేట అధికారి అబ్దుల్ మాజిద్ తదితరులు పాల్గొన్నారు.

వందరోజుల్లో అనేక విజయాలు ఆయుష్ సొంతం

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ హెరిటేజ్ ఇన్‌చార్జి డైరెక్టర్ జీ.పీ. ప్రసాద్ తదితరులు

సైదాబాద్, అక్టోబర్ 8 : కేంద్ర ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు వంద రోజుల్లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ హెరిటేజ్ (ఆయుష్)లో సంస్థ సాధించిన ముఖ్యమైన విజయాలను ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ జీ.పీ. ప్రసాద్ వెల్లడించారు. మంగళవారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని రెవెన్యూ బోర్డుకాలనీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ హెరిటేజ్ (ఆయుష్) సంస్థలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఆయుష్ వైద్య విధానికి చెందిన అరుదైన రాతప్రతులు, పుస్తకాలు మొదలైనవాటిని సేకరించి భద్రపర్చడం, సాహిత్య పరిశోధనలు, వాటి ప్రచురణకు పూర్తిగా అంకితమైందన్నారు. వంద రోజుల్లో ఆయుష్ ఔషధ మొక్కలపై వియత్నాం, ఆయుర్వేదానికి సంబంధించి మలేషియా దేశాలతో ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. అదే విధంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)తో ఒప్పందం కుదుర్చుకోవటంతోపాటు, ఆయుష్‌లో సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేశామని, ఇటువంటి అనేక రకాల ముఖ్య ఘటాలను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. ఆయుష్ సంస్థ వందరోజుల్లోనే అనేక అత్యంత విలువైన సమాచారాన్ని సేకరించి, డిజిటలైజేషన్ చేసి సొంతం చేసుకుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ రీసెర్చ్ (ఆయుర్వేదం) ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ టి.సాకేత్‌రామ్, డాక్టర్ సంతోష్ ఎస్ మానే, హోమియా రీసెర్చ్ ఆఫీసర్ బిశ్వ రంజన్‌దాస్, లైబ్రరీ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

టీచర్స్ కాలనీలో డెయిరీ వ్యర్థాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, అక్టోబర్ 8: కాలనీల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్‌లోని టీచర్స్ కాలనీ పరిసరాల్లో డెయిరీ ఫామ్ వల్ల స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీ సంక్షేమ సంఘాల ఫిర్యాదు మేరకు సోమవారం డెయిరీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డెయిరీ యజమానికి తెలిపారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. వ్యర్థాలను దూర ప్రాంతాలకు తరలించాలని కోరారు. టీచర్స్ కాలనీ ఫేజ్-2లో రహదారి, డ్రైనేజీ నిర్మాణం చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య కాలనీ అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, సాయిరెడ్డి, శివ, భూపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నరసింహారెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో..

ట్రంక్‌లైన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాత నాయక్

వనస్థలిపురం, అక్టోబర్ 8: అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. డివిజన్‌లోని ద్వారకా తిరుమల కాలనీలో జరుగుతున్న ట్రంక్‌లైన్ నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మురుగు సమస్యను శాశ్వతంగా తొలగించేందుకు ట్రంక్‌లైన్‌ను నిర్మిస్తున్నామన్నారు. కాలనీల్లో ఏ సమస్య నెలకొన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ మల్లికార్జున్‌గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవీ నామం.. మహిమాన్వితం

అమ్మవారికి మంగళ సూత్రాలు సమర్పణ

ఆర్కేపురం, అక్టోబర్ 8: ఆర్కేపురంలోని కుర్తాళం పీఠం ప్రత్యంగిరా దేవాలయంలో పీఠాధిపతులు జగద్గురు సిద్దేశ్వరానందభారతీ మహాస్వామి ఆశీస్సులతో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. జంటనగరాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. మంగళవారం డా.రాజశేఖర్, డా.సరస్వతీ దంపతులు అమ్మవారికి బంగారు మంగళసూత్రాలు సమర్పించారు. ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ సువర్ణలత దంపతులు అమ్మవారి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. అమ్మవారు శ్రీ మహా సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విఠల్‌శర్మ, హేమంత్‌శర్మ, రామశర్మ, అరుణ, శ్రీపతి, ఆశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్ శుభోదయ కాలనీలోని అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీలోని అమ్మవారి మండపంలో పూజలు చేసిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, సుమన్‌గౌడ్ తదితరులు

చంపాపేట, అక్టోబర్ 8: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కర్మన్‌ఘాట్ శుభోదయ కాలనీలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు మంగళవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్, ఎల్బీనగర్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్, యూత్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనాథ్, సురేందర్‌రెడ్డి, నాయకులు సదానంద్‌రెడ్డి, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్కేపురం: అల్కాపురి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి, శ్రీశైలం, ఆకాశ్, శ్రీకాంత్, శివ, సాయి, అనిల్, ప్రశాంత్, శ్రీధర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్: నాగోల్ డివిజన్ పరిధి శ్రీసాయినగర్ కాలనీలో శ్రీదుర్గాదేవి దేవాలయంలో అమ్మవారిని మహాలక్ష్మి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేశ్‌యాదవ్, ఆలయ అర్చకులు బాలమురళీకృష్ణ, కమిటీ సభ్యులు యాదగిరి, హన్మంతరావు, రవి, మురళి, రమణమూర్తి, కృష్ణమూర్తి, సత్తిరెడ్డి, వినోద్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ దేవాలయంలో..

సీఆర్ ఎన్‌క్లేవ్‌లోని స్వయంభూ పోచమ్మ దేవాలయంలో మాజీ కార్పొరేటర్, ఆలయ కమిటీ చైర్మన్ కొప్పుల విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం అమ్మవారిని సరస్వతిదేవి రూపంలో అలంకరించి పూజలు, చీరల వేలం పాట, అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు.

సైదాబాద్: సైదాబాద్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీ కాలనీలోని రేణుకాఎల్లమ్మ తల్లిని మంగళవారం మహాలక్ష్మిదేవిగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దాసరి శ్యామ్‌కుమార్, కమిటీ సభ్యులు కె.బాబురావు, కె.మల్లేశ్, యాదగిరి, ఎన్.ప్రవీణ్, పి.శేఖర్, డి.యశ్వంత్, ప్రశాంత్, జీవీ రావు, ఆనంద్ పాల్గొన్నారు.

ఎల్బీనగర్: మోహన్‌నగర్ చిత్తారమ్మ దేవాలయం, కొత్తపేట ప్రసన్న మహంకాళి దేవాలయం, నాగోలులోని మహంకాళి దేవాలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారికి కోటా ఉష బాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో నవరాత్రి పూజలు అంగరంగ వైభవంగా ఘనంగా జరుగుతున్నాయి.

శ్రీసాయినగర్‌కాలనీలోని శ్రీదుర్గాదేవి దేవాలయంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

మలక్‌పేట శ్రీహరిహర మైసమ్మ క్షేత్రంలో మహా చండీహోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపో-1లో మంగళవారం రాత్రి మహిళా ఉద్యోగులు, సిబ్బంది ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డిపో మేనేజర్ జలగం విజయ్ బతుకమ్మలకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డిపో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైదాబాద్ మాతృశ్రీ కాలనీలోని రేణుకాఎల్లమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి పూజలో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ దాసరి శ్యామ్‌కుమార్, సభ్యులు కె.బాబురావు, కె.మల్లేశ్, యాదగిరి, ఎన్.ప్రవీణ్, పి.శేఖర్, డి.యశ్వంత్ తదితరులు

పోలీసు విధులకు ఆటంకం.. రిమాండ్

హయత్‌నగర్, అక్టోబర్ 8: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని పసుమాములకు చెందిన మోడెపు శ్రీనివాస్‌గౌడ్, అతని అనుచరులు శివ, మధు కలిసి గత నెల 28న రాత్రి కుంట్లూరులో అతివేగం, అజాగ్రత్తగా మట్టిని టిప్పర్ల ద్వారా కుంట్లూరు మీదుగా తరలిస్తున్నారు. 100 డయల్ ఫిర్యాదు మేరకు విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ ఆర్.రాజేందర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వారిని అడుగుతుండగా రాయి పట్టుకుని చంపుతానని మోడెపు శ్రీనివాస్‌గౌడ్ దుర్భాషలాడుతూ చంపేందుకు ప్రయత్నించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు నిర్వహించి శ్రీనివాస్‌గౌడ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. నిందితుడిపై ఇప్పటికీ 9 కేసుల్లో ముద్దాయిగా ఉన్నట్లు తెలిపారు.

ప్లాటు కబ్జాచేసి దాడికి పాల్పడ్డారని ఫిర్యాదు..

హయత్‌నగర్, అక్టోబర్ 8: ప్లాటు కబ్జాచేసిన ఓ వ్యక్తి, తన అనుచరులతో కలిసి దాడికి పాల్పడ్డారని బాధితుడు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన మంగళవారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని పసుమాముల రెవెన్యూ నం.411లో సూర్యప్రకాశ్‌కు చెందిన 280 గజాల ప్లాటు కలదు. తన ప్లాటును చదును చేస్తుండగా అదే గ్రామానికి చెందిన జైపాల్‌రెడ్డి, అతని అనుచరులతో కలిసి దుర్భాషలాడుతూ తమపై దాడులకు పాల్పడ్డారు. 2006లో 400 గజాల స్థలాన్ని తాము కొనుగోలు చేశామని, అందులో 280 గజాలు కబ్జాకు గురైందన్నారు. ఎవరూ లేని సమయంలో చుట్టూ పెన్సింగ్ వేసుకుని కబ్జా చేసే ప్రయత్నం జైపాల్‌రెడ్డి చేస్తున్నారని ఆరోపించారు. తమ ప్లాటులోకి ఎవరూ రాకుండా హైకోర్టు ఆర్డర్ ఉన్న కూడా అదేమీ లేక్కచేయకుండా తమను భయభ్రాంతులకు గురిచేస్తూ దాడులకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నామని హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్ వెల్లడించారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గుర్రంగూడ శాఖ (కోడ్ నెం. 64381), వ్యాపార వేళల్లో బి.సత్యం, తండ్రి: బి.హనుమంతుగారు హౌసింగ్‌లోన్ నిమిత్తం నా క్లయింట్ ఎస్‌బిఐ సంప్రదించారు మరియు ఎస్‌బిఐ లోన్ మంజూరు చేయుటకు అంగీకరించినది. అతను దిగువ తెలిపిన షెడ్యూల్ ఆస్తిని ఎస్ఆర్ఓ వనస్థలిపురంతో రిజిస్టర్ అయిన డాక్యుమెంట్ నెం. 600/2021 ప్రకారం 08-01-2021 తేదీనాటి రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా శ్రీ తావిటికి సుధీర్ నుండి కొనుగోలు చేశారు. అతను ఎస్ఆర్ఓ హయత్‌నగర్‌తో రిజిస్టర్ అయిన రెండు లింక్ డాక్యుమెంట్లు 1) రిజిస్టర్డ్ సేల్‌డీడ్ డాక్యుమెంట్ నెం. 12945/1985, తేది: 10-10-1985, 2) రిజిస్టర్డ్ సేల్‌డీడ్ డాక్యుమెంట్ నెం. 6606/2007, తేది: 06-07-2007తో సహా పైన తెలిపిన తన ఒరిజినల్ డాక్యుమెంట్‌ను డిపాజిట్ ద్వారా చార్జ్ కల్పించాలని ఉద్దేశిస్తున్నారు. తుర్కయాంజల్ గ్రామం, హయత్‌నగర్ రెవెన్యూ మండలం, తుర్కయాంజల్ మున్సిపాలిటీ, గతంలో కమ్మగూడ గ్రామ పంచాయతీ రంగారెడ్డి జిల్లా, తెలంగాణ వద్దగల సర్వే నెం.లు 240, 241 మరియు 242లో 194.5 చ.గజాలు లేదా 162.66 చ.మీటర్ల విస్తీర్ణపు ప్లాట్ నెం. 93 (భూమి సరిహద్దులు: ఉత్తరం: పొరుగువారి భూమి, దక్షిణం: 25 అ.వెడల్పు రోడ్, తూర్పు: ప్లాట్ నెం. 94, పడమర: ప్లాట్ నెం. 92)కు సంబంధించిన ఈ డాక్యుమెంట్లను డిపాజిట్ చేసి బి.సత్యం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గుర్రంగూడ శాఖ (కోడ్ నెం. 64381) నుండి లోన్ పొందాలనుకుంటున్నారు. ఎస్ఆర్ఓ హయత్‌నగర్‌తో రిజిస్టర్ అయిన రెండు ఒరిజినల్ 1) రిజిస్టర్డ్ సేల్‌డీడ్ డాక్యుమెంట్ నెం. 12945/1985, తేది: 10-10-1985, 2) రిజిస్టర్డ్ సేల్‌డీడ్ డాక్యుమెంట్ నెం. 6606/2007, తేది: 06-07-2007 పోయినవని అతను తెలియజేస్తూ 16-07-2024న వనస్థలిపురం పోలీసులకు కంప్లయింట్ దాఖలు చేశారు. వనస్థలిపురం పోలీసులు ఎంత ప్రయత్నించినా సదరు డాక్యుమెంట్స్ దొరకలేవని తెలియజేస్తూ TSGGDI 05443571 ప్రకారం మీసేవ ద్వారా సర్టిఫికేట్ తేది: 20-06-2024 జారీ చేశారు. ఎవరేని వ్యక్తి/వ్యక్తులు సదరు ఆస్తిపై ఏదేని ప్రయోజనం, క్లెయిమ్, ఏదేని హక్కు, అభ్యంతరం కలిగి ఉన్నచో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 15 రోజులలోగా సర్వైన క్లెయిమ్‌తో 5-72/సి, రాజ్యలక్ష్మి నగర్ మెయిన్ రోడ్, గుర్రంగూడ, రంగారెడ్డి జిల్లా, పిన్-501 510 వద్దగల బ్రాంచి మేనేజర్, గుర్రంగూడ (కోడ్ నెం. 64381) వారిని సంప్రదించవలెను. లేనిచో నా క్లయింట్ పైన తెలిపిన లావాదేవీతో ముందుకు సాగుతారు, తరువాత ఎలాంటి క్లెయిమ్‌లు అనుమతించబడవు.

గూడ వెంకటేశ్వర్ రావు, అడ్వకేట్,
నెం. 3-4-526/7, కావేరి ఎన్‌క్లేవ్ ఫ్లాట్ నెం. 104, బర్కత్‌పుర, హైదరాబాద్, 500 027,
సెల్ నెం. 9948850011, 7386718100,

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

కందుకూరు, అక్టోబర్ 8: హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన అనంతరం అమలు చేయడం లేదని విమర్శించారు. హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారని చెప్పారు. హామీలు అమలు చేసే వరకు పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో దాసర్లపల్లి మాజీ సర్పంచ్ తాండ్ర దేవేందర్, కందుకూరు మాజీ ఎంపీటీసీ జంగయ్య పాల్గొన్నారు.

గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్‌ను అభినందించిన ఉప్పల

మన్సూరాబాద్, అక్టోబర్ 8: గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితుడైన చిలుక మధుసూదన్‌రెడ్డి మంగళవారం తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తాను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితుడైన చిలుక మధుసూదన్‌రెడ్డిని ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అభినందించి జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

చైతన్యపురి సీఐగా వెంకటేశ్వర్ రావు బాధ్యతల స్వీకరణ

ఎల్బీనగర్, అక్టోబర్ 8: రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ జోన్ చైతన్యపురి పోలీస్‌స్టేషన్ నూతన సీఐగా వెంకటేశ్వర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. చైతన్యపురి పోలీస్ స్టేషన్ సీఐగా ఉన్న వెంకటేశ్వర్లు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో వెంకటేశ్వర్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్తున్న వెంకటేశ్వర్లు నూతన సీఐ వెంకటేశ్వర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. నూతన సీఐ వెంకటేశ్వర్‌రావు రాచకొండ కమిషనరేట్ నుంచి బదిలీపై చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌కు రాగా చైతన్యపురిలో విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు బదిలీపై కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ డీఐగా వెళ్లారు.

టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులుగా రామకృష్ణారెడ్డి

బడంగ్‌పేట, అక్టోబర్ 8: హైదరాబాద్ టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులుగా బడంగ్‌పేటకు చెందిన రాళ్లగూడెం రామకృష్ణారెడ్డిని బీఎస్ఎన్ఎల్ నియమించిన్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర సంస్థలో నామినేటెడ్ పదవి దక్కడంపై రామకృష్ణారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డిని మంగళవారం అందెల శ్రీరాములు శాలువాతో సత్కరించారు.